హరితహారానికి సిద్ధంగా మొక్కలు

- ఈ ఏడాది లక్ష్యం 2.68 లక్షల మొక్కలు
- గ్రామ నర్సరీల్లోనే 92 శాతం మొక్కలు
- జూన్ రెండో వారం నుంచి నాటేందుకు ఏర్పాట్లు


రుక్కన్నపల్లి నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: ప్రతి గ్రామంలో వేల సంఖ్యలో చెట్లను పెంచి వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని చేపడుతుంది. ఇప్పటికే 8 విడతల్లో ప్రతి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ ఏడాది చేపట్టే తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమం కోసం మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ముమ్మరంగా ఏర్పాట్లు మొదలు పెట్టారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్ ప్రతి గ్రామంలో పర్యటించి


వెంకటాంపల్లిలో..

నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు పంచాయతీ కార్యదర్శులు, కూలీలకు సూచనలు చేస్తున్నారు.

ప్రతి గ్రామంలో నర్సరీ..

ప్రభుత్వం గతంలో కొన్ని గ్రామాలను ఎంపిక చేసుకుని లక్ష మొక్కల చొప్పున పెంచేవారు. కొత్త రెవెన్యూ చట్టంలో హరితహారం పథకాన్ని చేర్చడంతో ప్రతి గ్రామ పంచాయతీలో తప్పనిసరిగా గ్రామ నర్సరీని ఏర్పాటు చేస్తున్నారు. మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉండగా అన్నిగ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచే పనులు జరుగుతున్నాయి. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 10 వేల మొక్కల చొప్పున మొత్తం 2.68 లక్షల మొక్కలు పెంచనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. అదేవిధంగా గతేడాదికి సంబంధించిన మొక్కలు 20 వేలు ఉన్నట్లు వారు చెప్పారు. ఖిల్లా ఘనపురం మండలంలో ఇప్పటికే అన్ని గ్రామాల్లో 92 శాతం మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. మొక్కలు వేగంగా పెరిగేందుకు గాను అన్ని గ్రామాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

జూన్ నాటికి..



జూన్ రెండో వారంలో వర్షాలు కురిసిన వెంటనే నాటేందుకు మండలంలోని అన్నిగ్రామాల నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాం. అక్కడక్కడ విత్తనాలు మొలకెత్తని బ్యాగుల్లో మళ్లీ విత్తనాలు నాటించే పనుల్లో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. కేవలం 8 శాతం బ్యాగుల్లో మొలకలు రాలేదు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున మొక్కలు ఎండిపోకుండా నిర్వాహకులు రోజుకు రెండు సార్లు నీటిని అందిస్తున్నారు.

– విజయ్‌కుమార్, ఎంపీడీఓ, ఖిల్లాఘనపురం

నేత్రదానం చేసిన దంపతులు


వైద్యులకు నేత్రదానం అంగీకారం పత్రాలను అందజేస్తున్న దంపతులు

మదనాపురం: మదనాపురం మండలంలోని దంతనూరులో ఆదివారం బేరి శ్రీనివాసులు, జయలక్ష్మి దంపతుల 25వ వివాహ వార్షికోత్సవం కార్యక్రమాన్ని గ్రామస్తులు, బంధువుల సమక్షంలో ఘనంగా జరుపుకొన్నారు. సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వారికి నేత్ర దానం చేసేందుకు సమ్మతి పత్రాలను మదనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ భవాని, సూపర్‌వైజర్ ప్రమీలకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌నారాయణ, జిల్లా రైతు సమితి సభ్యుడు రవీందర్‌రెడ్డి, విండో వైస్‌చైర్మన్ చీర్ల శ్రీనివాసులు, మదనాపురం సర్పంచ్ రాంనారాయణ, టీసీ నాగన్నయాదవ్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, చుక్క కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు


సర్పంచ్‌కు ప్రొసిడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: మండలంలోని చంద్రనాయక్‌తండాలో ఆంజనేయస్వామి నూతన ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు ఎమ్మెల్యే మంజూరు చేశారని సర్పంచ్ శిల్పాశంకర్‌నాయక్ తెలిపారు. మక్తల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో ఆదివారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మొదటి దఫాలో రూ.ఐదు లక్షలకు సంబంధించిన ప్రొసీడింగ్‌ను అందించారన్నారు. పంచాయతీగా ఏర్పడిన మొదటి సారి నూతన ఆలయ నిర్మాణానికి తండావాసులు ఎమ్మెల్యేకు విన్నవించడంతో ఆయన ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.పది లక్షలు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సీతమ్మ, కృష్ణనాయక్, మంగ్యానాయక్, రాజునాయక్, హన్మంత్‌నాయక్, రమేష్ నాయక్, తుల్జనాయక్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు మరువలేనివి


చిన్నంబావిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూర్: దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు జయంతిని ఆదివారం ఆత్మకూర్‌లో ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా నాయకుడు కట్టెలమండి రాములు మాట్లాడుతూ ఎన్టీఆర్ పేదలకు సముచిత స్థానాన్ని కల్పించి, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో గాలిపంపు శ్రీనివాసులు, తిరుపతయ్యగౌడ్, రవికుమార్, వెంకటన్న, జగన్ కుర్మన్న, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి: నటకిరీటీ, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు శతజయంతి వేడుకలను మండల కేంద్రంలో టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎండీ హస్నొద్దీన్, లింగయ్య, బిచ్చన్న, కంది మహేష్, బాషా, మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

గోపాల్‌పేట: వనపర్తి పట్టణంలో సత్యసాయి సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగా మొత్తం 174 మంది కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా డ్రాప్స్, అద్దాలు ఇచ్చామని, మరో 54 మందికి కళ్ల ఆపరేషన్ చేసుకోవాలని సూచించామని డాక్టర్లు తెలిపారు. డాక్టర్ శ్రీధర్ బృందం పాల్గొన్నారు.

చెరువులో మొసలి

పెబ్బేరు రూరల్: శ్రీ రంగాపురం మండలంలోని తాటిపాముల వీరసముద్రం చెరువులో మొసలి కనిపించినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. అటు వైపు వెళ్లాలంటేనే రైతులు, పశువుల కాపరులు, మత్స్యకారులు జంకుతున్నారు. వెంటనే అటవీశాఖ అధికారులు స్పందించి తరలించాలని కోరుతున్నారు.

సీసీ రహదారుల నిర్మాణాలతో కాలనీలకు కొత్త శోభ

- రహదారి పనులను అడ్డుకోవడం సరికాదు.
- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా


మాట్లాడుతున్న ఏఎస్ఐ జమీర్, కమిషనర్ మహమ్మద్‌ఖాజా

అమరచింత: పట్టణంలో సీసీ రహదారుల నిర్మాణాలతో కాలనీలకు కొత్తశోభ సంతరించుకుంటుందని, అలాంటి రహదారి పనులను అడ్డుకోవడం సరికాదని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా అన్నారు. పట్టణంలోని నాల్గో వార్డులో సీఎం అష్యూరెన్స్ నిధుల ద్వారా మంజూరైన సీసీ రహదారిని నిర్మించడానికి వెళ్లిన కాంట్రాక్టర్‌తో గొడవ పెట్టుకొని పనులను కాలనీకి చెందిన కొంతమంది ఆదివారం అడ్డుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో వాదోపవాదాలు పెరుగకుండా గొడవ సద్దుమణిగించాలని కమిషనర్ మహమ్మద్‌ఖాజా ఏఎస్ఐ జమీరుద్దీన్‌తో కలిసి కాలనీవాసుజలతో మాట్లాడి రహదారి పనులను పునఃప్రారంభించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయని, వీటితో నాల్గో, ఐదో వార్డుల్లో సీసీ రహదారులను నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే త 90శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. పట్టణంలో జరిగే అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సింధు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రాధాన్యత


ముగ్గురు కవల విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

వీపనగండ్ల: గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను సమకూర్చుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తుందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రంగవరంలో 'మీ కోసం మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, రైతుబీమా, రైతుబంధు లాంటి పథకాలతో పాటు షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలను పేదలకు అందించి ఆర్థిక వెసలుబాటును అందించిందన్నారు. సాగునీటి కోసం ఎన్నో ప్రాజెక్టులను నిర్మించారని, మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీటిని క్రమం తప్పకుండా అందిస్తున్నామన్నారు. రంగవరం గ్రామానికి ఇరువైపులా రోడ్డును నిర్మించేందుకు మంత్రి నిరంజన్‌రెడ్డి సహకారాన్ని తీసుకుంటామని, గ్రామంలో రేషన్ షాపు ఏర్పాటు కోసం ప్రయత్నిస్తామని తెలిపారు. 357 సర్వే నెంబర్ భూమిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, సర్పంచ్ వేముల జయసుధ, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, యాదవస్వామి, కర్ణాకర్‌రెడ్డి, సర్దార్, రజాక్, తదితరులు పాల్గొన్నారు.

కవలలకు అభినందన..

మండలంలోని కల్వరాలకు చెందిన చింత మంజుల, రమేశ్ దంపతులకు కవల పిల్లలుగా జన్మించిన ముగ్గురు విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరచడంతో ఆదివారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి వారిని శాలువాలతో సన్మానించారు. ముగ్గురు కవల పిల్లల్లో జతిన్‌కు 10 జీపీఏ, జీవన్‌కు 9.8 జీపీఏ, భవన్‌కు 9.7 జీపీఏ రావడంతో వారిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు సర్దార్, బుచ్చిరెడ్డి, శేఖర్, చింత రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం తోటల సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

వీపనగండ్ల: ఆయిల్‌పాం తోటలను సాగు చేయడం వల్ల అధిక లాభాలను పొందవచ్చని ఉద్యానవన అధికారి కృష్ణ తెలిపారు. ఎకరాకు రూ.1,140 డీడీ ద్వార చెల్లిస్తే 57 ఆయిల్‌పాం మొక్కలను అందజేస్తామన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం, బోరు, కరెంటు వసతులు కలిగి ఉన్న రైతులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్‌పాం తోటల్లో మొదటి నాలుగేళ్లు అంతర పంటగా మొక్కజొన్న, వేరుశనగ, కందులు, మినుములు, పెసర, నువ్వులు, పొద్దుతిరుగుడు సాగు చేసి రైతులు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల రైతులు ఈ నెల 31వ తేదీ వరకు తమ దరఖాస్తులను అందజేయాలని ఆయన కోరారు.

శ్మశాన వాటిక స్థలం వివాదం

- సమాధులను ధ్వంసం చేశారంటూ ఆరోపణ
- రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో వాగ్వాదం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వడ్డెర, వాల్మీకి బోయలు


శ్మశానవాటిక వద్ద నిరసన తెలుపుతున్న ప్రజలు

ఆత్మకూర్: భూ బకాసురులు శ్మశానవాటికలను సైతం కొల్లగొడుతున్నారు. సమాధులను ధ్వంసం చేసి ఆ స్థలాన్ని ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. ఆత్మకూర్ పట్టణంలోని సర్వే నంబర్ 439లో 3 ఎకరాల 18గుంటల స్థలంలో వడ్డెర, బోయల శ్మశాన వాటిక ఏళ్లుగా ఉంది. శ్మశానవాటిక స్థలం కబ్జాకు గురైందని, ఆ స్థలాన్ని కాపాడాలంటూ స్థానికులు గతంలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాల్సి ఉండగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు రంగంలోకి దిగి భూమిని చదును చేసి కంచె ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్దసంఖ్యలో ఆదివారం సంఘటన స్థలానికి చేరుకుని రియల్ వ్యాపారులతో వాగ్వాదానికి దిగారు. సుమారు మూడు గంటల పాటు శ్మశానవాటిక స్థలం వద్ద నిరసన తెలిపారు. నాలుగు తరాలుగా వడ్డెర, బోయల శవాలకు ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం ఈప్రాంతంలో భూముల ధరలు ఆకాశాన్నంటడంతో రియల్టర్ల కన్ను పడిందని వాపోయారు. వీరి నుంచి స్థలాన్ని కాపాడాలని వారు కోరుతున్నారు. కార్యక్రమంలో పెద్ద నర్సింహ, కురుమూర్తి, బుచ్చన్న, నాగన్న, బాలస్వామి, ఆంజనేయులు, బాలు, రాములు, నర్సింహ, చిన్న, నాగన్న తదితరులు ఉన్నారు.

సంఘం పేరు చెప్పి డబ్బులు వసూలు..

తమ కుల సంఘం పేరు చెప్పి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై క రూ.5లక్షలు వసూలు చేశారు. వారితో వడ్డెరలు వాగ్వాదానికి దిగారు. ఏ సమస్య వచ్చినా మేము చూసుకుంటామని ఆ వ్యక్తులు రియల్ వ్యాపారులకు భరోసా ఇచ్చినట్లు తెలియడంతో వడ్డెరలు రియల్ వ్యాపారులను నిలదీయడంతో డబ్బుల వ్యవహారం బయటపడిందని తెలిసింది. డబ్బుల సంగతి పక్కన బెట్టి శ్మశానవాటిక స్థలం జోలికి వస్తే చట్టపరంగా ఎదుర్కొంటామని వారు స్పష్టం చేశారు.

శ్మశాన వాటికను కాపాడాలి..



ఆత్మకూర్ పట్టణ శివారులోని సర్వేనంబర్ 439లో 3.18 ఎకరాల శ్మశానవాటిక స్థలం ఉంది. ఏళ్లుగా మా కులపోల్లు చనిపోతే అక్కడే ఖననం చేస్తున్నాం. చట్టుపక్కల భూములకు డిమాండ్ రావడంతో శ్మశాన వాటికను కబ్జా చేసేందుకు ప్రయతిస్తున్నారు.

– బడ్డె బుచ్చన్న, ఆత్మకూర్

చర్య తీసుకోవాలి..



శ్మశానవాటికను కబ్జా చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. అధికారులు పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి స్థలానికి హద్దులు చూయించి కంచెను ఏర్పాటు చేయాలి. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరుగకుండా నిందితులపై కేసులు నమోదు చేయాలి.

– వడ్డె నాగన్న, ఆత్మకూర్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2001–02 సంవత్సరంలో పదో తరగతిని పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆనాటి ఉపాధ్యాయులైన కృష్ణారెడ్డి, నారాయణ, బిచ్చయ్యగౌడ్, ఖాజామైనుద్దీన్, సుగుణారెడ్డిలను వారు సన్మానించారు. కార్యక్రమానికి ఎస్ఐ రామన్‌గౌడ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శరత్, రవీందర్‌దాస్, రాఘవేందర్‌రెడ్డి, తోట రామకృష్ణ, రాము, చిన్నికృష్ణ, రేణుక, అరుణ, రాధ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1985–86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం మండల కేంద్రంలోని పద్మశాలి కళ్యాణమండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నాడు చదివిన పాఠశాలలో ప్రస్తుతం చదువుతున్న పేద విద్యార్థులను ఆర్థికంగా ఆదుకునేందుకు చేయూతనివ్వాలని నిర్ణయించారు. కార్యక్రమంలో రాళ్ల కృష్ణయ్య, శ్రీనివాసులు, వెంకటేష్, రాజేందర్, కిన్నెర శ్రీనివాసులు, బాలస్వామి, బాలశంకర్, భీమన్న, వెంకటయ్య, సాధిక్ తదితులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం 1992–93లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రాఘవాచారి, వేమన్న, ఆనంద్, పార్థసారథి, బాలస్వామి, గౌస్‌పాషాను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్‌యాదవ్, ఆనంద్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, మురళి, నాగేంద్రం, వెంకటయ్య, మన్నెం, సత్యారెడ్డి, చెన్నయ్య, సంగీత, నూర్జహన్, కల్పన, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.


శ్రీరంగాపురంలో పూర్వ విద్యార్థులు


వీపనగండ్లలో..


ఖిల్లాఘనపురంలో..

అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లోకి

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కందూర్ స్టేజీ వద్ద ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో నాయకుడు కారెడ్డి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారిని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్‌లు బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణలో ప్రతిపక్షాలను ప్రజలు తరిమి కొడతారని ఎమ్మెల్యే ఆల పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ శ్రీకాంత్, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ కోఆప్షన్ మహిమూద్, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, సీనియర్ నాయకుడు దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు ప్రజావాణి

వీపనగండ్ల: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పాండునాయక్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో పంచాయతీరాజ్, మహిళా సమాఖ్య, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఫిర్యాదు దారులు ప్రస్తావించిన సమస్యలను స్థాయిని బట్టి అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ పోటీలు



ఆత్మకూర్: చిట్టెం రామన్న యువసేన ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. స్థానిక బీసీ కాలనీలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, వార్డు మాజీ సభ్యుడు గడ్డమీది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 62 జట్లు తలపడ్డారు. మొదటి బహుమతి సాధించిన ఆత్మకూర్ అబీ ఫ్రెండ్స్ జట్టుకు రూ.50వేలు నగదు, షీల్డు, రెండో బహుమతి సాధించిన మక్తల్ జట్టుకు రూ.25వేలు నగదు, షీల్డును చైర్‌పర్సన్ గాయత్రి అందజేశారు. ఆటలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు వేర్వేరుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు హరీష్, రఘు, కమాల్, నవీన్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీలో బీపీ మాత్రలు కరువు

అమరచింత: మండల కేంద్రంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీపీ, షుగర్ మాత్రలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రఘు తెలిపారు. నెల రోజులుగా ఆస్పత్రికి బీపీ, షుగర్ మాత్రల కోసం వస్తున్న ప్రజలకు మాత్రలు లేవని సిబ్బంది వెనక్కి పంపిస్తున్నారని, అయినా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. మండల కేంద్రంలో ఉన్న ఆస్పత్రికి వివిధ గ్రామాల నుంచి జ్వరం, ఇతర వ్యాధులతో బాధపడుతూ వస్తున్న వారికి సరైన వైద్యసేవలు అందటం లేదని ఆరోపించారు. జిల్లా వైద్యాధికారి చొరవ చూపి పేదలకు అవసరమయ్యే బీపీ, షుగర్ మాత్రలను అందుబాటులో ఉంచాలని, లేని పక్షంలో ఆస్పత్రి ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

శ్రామిక జనజీవన చైతన్యమే కవిత్వం



గోపాల్‌పేట: శ్రామిక జన చైతన్యం కోసమే కవిత్వం అని తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి అన్నారు. ఆదివారం ఆమె తెలంగాణ సాహితీ మండలి, ప్రజానాట్య మండలి, జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కవికి పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ సంస్కర్త సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కవులు, గాయకులు సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వల్లభాపురం జనార్దన్, మోహన్‌కృష్ణ, సలీమ, ఎండీ జబ్బార్ పాల్గొన్నారు.

రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో..

వనపర్తి రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో సురవరం ప్రతాపరెడ్డి 127వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగేశ్వర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ సాహితీ గొంతుక సురవరం..

పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల టీజేఏసీ ఆధ్వర్యంలో సురవరం ప్రతాపరెడ్డి 127వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో..

వనపర్తి నియోజకవర్గ ప్రథమ శాసన సభ్యుడు సురవరం ప్రతాపరెడ్డి జన్మదినం సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో గల సురవరం ప్రతాపరెడ్డి విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన బోయ రాముడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు కొండేరు గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పోతురాజు శంకరమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమనాద్రి సూచన మేరకు రూ. 5000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు దేవన్న, సురేష్, తేజ, ముని, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

మరమ్మతు చేపట్టాలి

మానవపాడు: ఆర్డీఎస్ కాలువ డీ–29, డీ–30, డీ–31కు సంబంధించిన కాలువ పూడికతీత పనులు అసవపూర్తిగా ఉన్నాయని వెంటనే మరమ్మతు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా కాలువలపై నిర్మించిన మినీ వంతెనకు రక్షణగోడలు కూలాయని పేర్కొన్నారు. రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు.